
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
శుక్రవారం 29 మార్చి 2024





రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	శుక్రవారం	సా : 6.34 గం.
సహర్ :	శనివారం	ఉ : 4.50 గం.

- పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ పూర్తి
- ఏప్రిల్ మొదటి వారంలో సిబ్బందికి శిక్షణ
- ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు

పోరుకు సిద్ధం..



పోలింగ్ సిబ్బంది వివరాలు

పీవో	769
ఏపీవో	729
ఓపీవో	1447
మైక్రో అబ్జర్వర్స్	59
మొత్తం	3004

లోక్‌సభ ఎన్నికలకు కసరత్తు

జనగామ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో జిల్లా అధికార యంత్రాంగం బిజీబిజీగా ఉంది. దేశవ్యాప్తంగా 18వ లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కాగా ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడనుంది. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. జనగామ జిల్లా పరిధిలో జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో జనగామ అసెంబ్లీ నియోజకవర్గం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉండగా, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు వరంగల్(ఎస్సీ) పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అటు వరంగల్ రిటర్నింగ్ అధికారి, ఇటు భువనగిరి రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో జిల్లా అధికార యంత్రాంగం పనిచేయనుంది. ఎన్నికల పోలింగ్‌కు ఇంకా 47 రోజుల సమయం ఉండగా అధికారులు ఇప్పటికే ఎన్నికల నిర్వహణపై కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ సజావుగా సాగేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో ఎన్నికలు శాంతియుతంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగేందుకు గానూ జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసులు సవాల్‌గా తీసుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికే చేపట్టాల్సిన ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే నియోజకవర్గాల వారీగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించగా తాజాగా పోలింగ్ సిబ్బంది కేటాయింపునకు సంబంధించిన కసరత్తు కూడా ప్రారంభించారు.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బందికి సంబంధించిన మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల యంత్రాంగం పూర్తి చేసింది. పోలింగ్ విధులు నిర్వర్తించే సిబ్బంది వివరాలను క్రోడీకరించి సిద్ధంగా ఉంచుకున్నారు. రెండో విడత ర్యాండమైజేషన్‌లో మండలాల వారీగా కేటాయింపులు జరుపుతారు. ఈ రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ఏప్రిల్ మొదటివారంలో జరగనుంది. రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి కాగానే నియోజకవర్గాల వారీగా కేటాయించిన సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చినప్పటికీ ఎవరెవరికి ఏ పోలింగ్‌కేంద్రాన్ని అలాట్ చేసిన విషయాన్ని పోలింగ్‌కు ఒక రోజు ముందుగానే చెబుతారు. సిబ్బందికి శిక్షణ పూర్తి కాగానే ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా మొదటి విడతలో కలెక్టరేట్ స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న ఈవీఎంలను ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి పనితీరును పరిశీలిస్తారు. ఆ తర్వాత వాటిని నియోజకవర్గాల వారీగా పంపిస్తారు. నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్‌రూముల్లో రెండో విడత ర్యాండమైజేషన్ చేసి పోలింగ్‌కు ఒక రోజు ముందు కేంద్రాలకు తరలిస్తారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది. ఈవీఎంల మొదటి విడత ర్యాండమేజేషన్ ప్రక్రియ నోటిఫికేషన్ వచ్చే ఏప్రిల్ 18 కంటే ముందు జరగనుంది. కాగా.. ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు గానూ జిల్లా ఎన్నికల యంత్రాంగం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. గ్రామాలు, మండలాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఓటు ఆవశ్యకతపై వివరిస్తున్నారు.

861 పోలింగ్ స్టేషన్లు..
3444 పోలింగ్ సిబ్బంది..

- జనగామ జిల్లా పరిధిలోకి వచ్చే జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల పరిధిలో మొత్తంగా 861 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇందులో జనగామలో 277, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 290, పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో 294 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారితో పాటు మరో ఇద్దరు చొప్పున సిబ్బంది(అదర్ పోలింగ్ ఆఫీసర్-ఓపీవో) నియమించనున్నారు. వీరితో పాటు మూడు నియోజకవర్గాలకు కలిపి 59 మంది మైక్రో అబ్జర్వర్లను నియమిం చనున్నారు. ఈ లెక్కన మూడు నియోజకవర్గాల పరిధిలోని 861 పోలింగ్ స్టేషన్లకు 3004 మంది పోలింగ్ సిబ్బందిని నియమించనున్నారు.



ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా (ఫైల్)



ఓటు హక్కు వినియోగంపై జనగామలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు


కాంగ్రెస్‌లో వరంగల్ హీట్!

- ఎంపీ టికెట్ విషయంలో సీఎం వర్సెస్ మంత్రులు?
- ఏకాభిప్రాయం కుదరక ఎటూ తేల్చని అధిష్ఠానం
- వ్యవహారానికి తెరదించేందుకు ఏఐసీసీ నేతల ప్రయత్నాలు
- పొత్తులో భాగంగా టికెట్ తమకే కేటాయించాలని సీపీఐ పట్టు

వరంగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్‌లో వరంగల్ ఎంపీ టికెట్ వ్యవహారం హీట్ పెంచుతోంది. అభ్యర్థిత్వం విషయంలో అటు సీఎంకు ఇటు మంత్రులకు మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదని, తలా ఒకరి పేరు చూపుతుండటంతోనే జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి తనతో పాటు కాంగ్రెస్‌లోకి వచ్చిన దొమ్మాటి సాంబయ్యకు టికెట్ ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన ఇందిరకు టికెట్ ఇవ్వాలని మంత్రులు భట్టి, ఉత్తమ్ పట్టుబడుతున్నట్టు సమాచారం. దీంతో సీఎం, మంత్రుల మధ్య వరంగల్ సీటు విబేధాలకు బీజం వేస్తుందేమోనన్న చర్చ జరుగుతోంది. వరంగల్ స్థానం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నప్పటికి సరైన అభ్యర్థి లేరని సర్వేలు రిపోర్టులు వస్తుండటంతో ఎవరికి టికెట్ ఇవ్వాలో తేల్చుకోలేకపోతున్న అధిష్ఠానం అభ్యర్థిని ఖరారు చేయకుండా పెండింగ్‌లో పెడుతోందన్న ప్రచారం జరుగుతోంది. ఇదంతా ఇలా ఉంటే సీపీఐ రూపంలో కాంగ్రెస్‌కు మరో సమస్య ఎదురవుతోంది. పొత్తులో భాగంగా

మిగతా 8వ పేజీలో...

తెరపైకి కడియం..





వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిపై ఉత్కంఠ పెరుగుతుంది. ఇప్పటికే ఎవరికి వారు కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తుండటం, సీఎం, మంత్రులతో పాటు పీసీసీ, ఏఐసీసీ నేతల మధ్య అభ్యర్థుల విషయమై ఏకాభిప్రాయం రాకపోవడం లాంటి పరిణామాల నేపథ్యంలోనే.. బీఆర్ ఎస్ అభ్యర్థి కడియం కావ్య ఎన్నికల బరి నుంచి తప్పుకోవటంతో కాంగ్రెస్ ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది. స్టేషన్ ఘన పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రె స్ పార్టీలోకి తీసుకవచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ అధిష్ఠా నం.. కడియం శ్రీహరి కాంగ్రెస్‌లోకి వస్తే అయననే వరంగల్ ఎంపీ అభ్యర్థిగా బరిలో దించాలని యోచిస్తోంది. 2014లో కడియం శ్రీహరి వరంగల్ ఎంపీగా విజయం సాధించారు. దీంతో పాటు సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉండటంతో ఉమ్మడిజిల్లాలోని అన్ని పార్టీల నేతలతో శ్రీహరికి పరిచయాలున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీహరిని ఎంపీగా పోటీ చేయించి, ఆయన గెలిచిన తర్వాత స్టేషన్‌ఘనపూర్‌కు వచ్చే ఉపఎన్నికల్లో కడియం శ్రీహరి కుమార్తె కావ్యను ఎమ్మెల్యేగా పోటీ చేయిస్తారనే ప్రచారం జరుగుతుంది. ఒకవేళ శ్రీహరి పోటీ చేయకపోతే కావ్యనే ఎంపీ అభ్యర్థిగా బరిలో దింపవచ్చుననే చర్చ కూడా జరుగుతోంది. అయితే పార్టీ మారే విషయంలో తాము ఇంకా ఏం నిర్ణయం తీసుకోలేదని కడియం శ్రీహరి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దీంతో కాంగ్రెస్ టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న నేతల్లో కడియం ఎపిసోడ్ ఉత్కంఠ రేపు తోంది. వరంగల్ టికెట్ ఎవరికి దక్కుతుందనే టెన్షన్ క్యాడర్‌లో నెలకొంది.

పార్లమెంట్ ఎన్నికల్లో
కాంగ్రెస్ గెలుపు ఖాయం

- జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



అరవింద్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొమ్మూరి

జనగామ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నుంచి పలువురు నాయకులు కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో గురువారం చేరారు. కండువాను కప్పి కాంగ్రెస్‌లోకి కొమ్మూరి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అప్రజాస్వామిక పాలనలో ప్రజల హక్కుల కోసం పోరాడిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి భువనగిరి టికెట్ ఇవ్వడం మంచి పరిణామమన్నారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తికి తగిన గుర్తింపు దక్కిందన్నారు. చామల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అహంకారపూరిత ప్రభుత్వాన్ని ప్రజలు కూలదోసినా ఆ పార్టీ నాయకులు ఇంకా సిగ్గు రావడం లేదని మండిపడ్డారు. అధికారం కోల్పోయినా ప్రజలను మోసపూరిత మాటలతో మభ్యపెట్టాలని చూస్తుందని విమర్శించారు. ఓటమిపై ఆత్మ విమర్శ చేసుకోకుండా బీఆర్ఎస్ నాయకులు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారన్నారు. గెలిచిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజల హృదయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి స్థానం సంపాదించుకున్నారన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్

బీఆర్ఎస్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ మల్లవరం అరవింద్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో ఆయన హస్తం గూటికి చేరారు. ఆయనతో పాటు మాజీ సర్పంచి వల్లాల మల్లేశం, జనగాం వీరేందర్‌రెడ్డి, ఎండీ రహీం, పల్లె వెంకటేశ్, పల్లె సురేశ్, బుర్ర రాజశేఖర్, కలకుంట్ల శ్యామ్, అర్జున్, బండ లక్ష్మీ వెంకటేశ్, కొంతం వెంకటేశ్, బిర్రు మధు, అందె సత్యనారాయణ, పరమేశ్ కాంగ్రెస్‌లో చేరారు.

లైసెన్స్‌డ్ తుపాకులను అప్పగించండి..

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, మార్చి 28: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని అనుమతులు ఉన్న తుపాకులను కలిగిన వ్యక్తులు, ప్రైవేటు సంస్థలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా తీసుకునే ముందస్తుచర్యల్లో భాగంగా ఆయుధాలను అప్పగించాలని ఆయన సూచించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 201 అనుమతి ఉన్న తుపాకులు ఉన్నాయన్నారు. హనుమకొండ జిల్లాలో 131, వరంగల్ జిల్లాలో 52, జనగామ జిల్లాలో 18 ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన ఆయుధాలను ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత తిరిగి ఇస్తామన్నారు. కాగా, జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బంది, గార్డు డ్యూటీలో ఉన్నవారికి మినహాయింపు ఉంటుందని అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పొలిటికల్ వార్!

ఏసీపీపై బదిలీ వేటు

జనగామ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య నడుస్తున్న పొలిటికల్ వార్ జనగామ ఏసీపీ సూదిరెడ్డి దామోదర్‌రెడ్డిపై బదిలీ వేటుకు కారణమైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జనగామలో అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి అటు హస్తం, ఇటు గులాబీ పార్టీ నేతల మధ్య వైరం నడుస్తోంది. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఓడిపోయిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మధ్య ఢీ అంటే ఢీ అన్నట్లుగా పరిస్థితి తయారైంది. ఒకరితో ఒకరు పై చేయి సాధించేందుకు నియోజ కవర్గంలో పర్యటనలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో రెండు పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్న చందంగా పరిస్థితి మారిపోయింది. ఈ రెండు పార్టీల మధ్య నడుస్తున్న పొలి టికల్ వార్ ఏసీపీ బదిలీకి కారణమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఏసీపీపై బదిలీ వేటు పరిణామంతో ఇటీవల ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై నమోదైన కోడ్ ఉల్లంఘన కేసు కూడా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 20న జనగామ పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద రోడ్డుపై ఉన్న చిరువ్యాపారులు, కూరగాయలు, పండ్ల దుకాణాల వ్యాపారులతో పల్లా ముచ్చటించారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించారం టూ జనగామ పోలీసులు ఆయనపై ఈ నెల 23న కేసు నమోదు చేశారు. ఈ మేరకు జనగామ తహసీల్దార్ ఇచ్చిన ఆదేశాల తోనే కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. కాగా.. కాంగ్రెస్ నేతల ఒత్తిడితోనే తనపై పోలీసులు కేసు నమోదు చేశారని ఎమ్మెల్యే పల్లా భావించినట్లు సమాచారం. ఇదే క్రమంలో పల్లాపై కేసు నమోదైన రోజే పెంబర్తిలో కాంగ్రెస్ నేతలతో, ఏసీపీ దామో దర్‌రెడ్డి చలివేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొ న్నారు. దీంతో.. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ కాంగ్రెస్ నేతలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ దామోదర్‌రెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీ-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సం ఘానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎన్నికల సంఘం ఆదేశాలతో డీజీపీ రవిగుప్తా ఏసీపీపై బదిలీ వేటు వేస్తూ డీజీపీ కార్యాలయం లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. కాగా.. జనగామ ఏసీపీగా దామోదర్‌రెడ్డి ఫిబ్రవరి 14న బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన నెలన్నరకే ఆయనపై బదిలీ వేటు పడడం చర్చనీయాంశమైంది.



చలివేంద్రం ప్రారంభంలో పాల్గొన్న ఏసీపీ దామోదర్‌రెడ్డి (ఫైల్)



ఏసీపీ దామోదర్‌రెడ్డి

రైతు నిరసనకు స్పందించిన అధికారులు

భూమిని పరిశీలన.. పోశయ్య నుంచి వివరాల సేకరణ

బచ్చన్నపేట, మార్చి 28: "అరవై ఏళ్లుగా భూమిని నమ్ముకుని బతుకుతున్నా. గతంలో పని చేసిన వీఆర్వోలు నా పేరిట రికార్డు చేయమంటే లంచం అడిగారు. డబ్బులు ఇవ్వకపోవటంతో పట్టించుకోలేదు. దయచేసి నా భూమిని రికార్డులో నమోదు చేయించేలా చేయండని రైతు తెలిపిన నిరసనకు ఎట్టకేలకు అధికారులు స్పందించారు. గురువారం రెవెన్యూ క్షేత్రస్థాయి విచారణ చేశారు. రైతు పోశయ్య బుధవారం ఫ్లెక్సీతో నిరసన తెలిపిన విషయం విధితమే. ఈ మేరకు హైదరాబాద్, జనగామ జిల్లా రెవెన్యూ కార్యాలయ అధికారులు తీవ్రంగా స్పందించడంతో గురువారం విచారణకు నాయబ్ తహసీల్దార్ ఖాసీం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎండీ మున్వర్‌లు వెళ్లి విచారణ జరిపారు. కాగా 1999, 2002 సంవత్సరాల్లో కౌలుకు తీసుకున్న డబ్బులు చెల్లించిన పత్రాలను అధికారులకు చూపారు. మరిన్ని పత్రాలు ఉన్నాయని చెప్పడంతో రెండు రోజుల్లో కార్యాలయంలో అందించాల్సిందిగా సూచించారు. కాగా అంతకు ముందు పోశయ్య మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చి, ప్రధాన ద్వారం ఎదుట ఫ్లెక్సీతో నిరసన తెలిపారు. తనకు న్యాయం చేయాలంటూ కోరారు. అనంతరం ఎంఆర్ఐ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందించారు.



పోశయ్య ఫిర్యాదుతో విచారణ జరుపుతున్న రెవెన్యూ అధికారులు

రైతుల విషయంలో
రాజకీయాలు తగదు

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



కొడకండ్లలోని శ్రీరాంసాగర్ కాలువలను పరిశీలిస్తున్న యశస్వినిరెడ్డి

కొడకండ్ల మార్చి 28 : రైతుల విషయంలో రాజకీయాలు తగదని పాలకుర్తి ఎంఎల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ కాలువలను, ప్రవహించే నీటిని ఆమె గురువారం పరిశీలించారు. ఆ కాలువల గుండా వస్తున్న గోదావరి జలాల వినియోగం గురించి స్థానిక రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ రెండో దశ కాలవల ద్వారా ప్రతీరోజు 17 వందల క్యూసెక్కుల నీటిని ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. మండల పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి ఒకరు పంటలు ఎండిపోతున్నాయని రాద్ధాంతం చేయడం తగదని హితవు పలికారు. రైతు సంక్షేమమే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి.సురేష్ నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్ నాయక్, కాంగ్రెస్ నాయకులు శ్రీవర్ధ, ఐత రాజు, సోమనర్సయ్య, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు.. డాక్టర్ అనే పదం వాడొద్దు

వరంగల్ మెడికల్, మార్చి 28: ప్రథమ చికిత్స చేసే వ్యక్తులు తమ పేరు ముందు డాక్టర్ అనే పదాన్ని వాడరాదని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నోటీసులు జారీ చేశారు. ఇలాంటి వ్యక్తులు చేసే వైద్య సహాయ కేంద్రం ముందు ఫస్ట్ ఎయిడ్ సెంటర్, ప్రథమ చికి త్స కేంద్రమని మాత్రమే రాయాలని సూచించారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 (రూల్ 2011) ఎవరూ అతిక్రమించినా చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి హెచ్చరించారు.



హనుమకొండ జూపార్క్‌లో ఆస్ట్రిచ్ పక్షులకు నీరు కొడుతున్న సంరక్షకుడు



చిరుతపులి బ్యారక్ఎదుట కూలర్ ఏర్పాటు చేసిన దృశ్యం

వణ్యప్రాణులకు వేసవి తాపం

ఎండలు మండుతున్నాయి. జనమే కాదు పశుపక్షాదులూ ఎండతీవ్రతకు అల్లాడుతున్నాయి. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో సగటున గరిష్ఠంగా 38డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవగా.. మధ్యాహ్నం సమయంలో రహదారులు, కూడళ్లలో అంతగా జనసంచారం కనిపించలేదు. ఇక ప్రజలు శీతలపానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఈనేపథ్యంలో హనుమకొండలోని వనవిజ్ఞాన్ కేంద్రం జూపార్క్‌లో చిరుతపులి ఉండే బ్యారక్‌కు పరదాలు, కూలర్ ఏర్పాటు చేయగా.. ఆస్ట్రిచ్ పక్షులకు, ఇతర జంతువులు, పక్షులు ఉండే బోన్ల చుట్టూ పరదాలు కట్టి సంరక్షకులు నీటితో తడుపుతున్నారు.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్, హనుమకొండ

ఉద్యోగాల పేరిట మోసం

రూ.5కోట్ల వసూలు

పోలీసుల అదుపులో నిందితుడు?

వరంగల్ క్రైం, మార్చి 28: ఉద్యోగాల పేరిట మోసం చేసి రూ.5కోట్లు వసూలు చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నలుగురు ముఠాగా ఏర్పడి గ్రూప్-1 ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసి హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన పలువురు నిరుద్యోగుల నుంచి రూ.5కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై వరంగల్ పోలీసులకు సమాచారం అందడంతో నగరానికి చెందిన ఒక వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న నిందుతుడిని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. కమిషనరేట్ కార్యాలయం సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో పెట్టి నిందితుడి నుంచి వాస్తవాలు సేకరించినట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడి కుమారుడితోపాటు మరో ఇద్దరు ఈ మోసంలో భాగస్వాములుగా ఉన్నట్లు పోలీసుల తమదైన శైలిలో చేసిన విచారణలో బహిర్గతమైనట్లు సమాచారం. ఇంకా పూర్తిస్థాయి విచారణ చేసి శుక్రవారం పోలీసులు వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, మార్చి28: డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 22మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ షాకూర్ తెలిపారు. గురువారం 22 మందిని కోర్టులో హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 18 మందికి రూ.22,100, డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులో ఐదుగురికి రూ.3,100 జరిమానాను న్యాయమూర్తి రమేశ్ విధించారన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

హనుమకొండ టౌన్, మార్చి28: ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం పోలీస్ హెడ్‌క్వార్టర్ ఎదుట చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... లోటస్ కాలనీ చెందిన ఎస్.ఉపేందర్ (65) బుధవారం హెడ్‌క్వార్టర్ జంక్షన్‌లో రోడ్డు క్రాస్ చేస్తుండగా మాడిశెట్టి షణ్ముక అనే వ్యక్తి ద్విచక్రవాహనంతో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఢీకొట్టగా ఉపేందర్‌కు కుడికాలు, చేతికి గాయాలయ్యాయి. బాధితుడి మనవడు సోమ సాయిశరత్ హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో మరిచిపోయిన చీరలను అందజేసిన పోలీసులు

హనుమకొండ టౌన్, మార్చి28: హనుమకొండ బస్టాండ్‌లో బస్సులో మరిచిపోయిన చీరల బ్యాగును తిరిగి బాధితుడికి పోలీసుల అందజేశారు. పోలీసులకు కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలుకు చెందిన ఓ ప్రయాణికుడు చీరెల బ్యాగుతో హైదరాబాద్‌కు వెళ్లేందుకు మంగవారం సాయంత్రం హనుమకొండ బస్టాండ్‌కు చేరుకున్నాడు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు ముందుగా శ్రీశైలం బస్సు ఎక్కి తర్వాత మరో బస్సు రాగానే చీరెల బ్యాగును మరిచిపోయి ఆ బస్సు ఎక్కాడు. అయితే చీరెల బ్యాగు గుర్తుకొచ్చి మొదటి బస్సు వద్దకు వెళ్లగా.. ఆ బస్సు వెళ్లిపోయింది. బాధితుడు వెంటనే హనుమకొండ పోలీసులను ఆశ్రయించగా సీసీ ఫుటేజీల ఆధారంగా బస్సును గుర్తించి డ్రైవర్‌కు సమాచారం చేరవేశారు. తిరగుప్రయాణంలో చీరెల బ్యాగును తీసుకొచ్చి పోలీసుల సమక్షంలో బుధవారం రాత్రి బాధితుడికి అందజేశాడు. కాగా చీరెల విలువ రూ.50,000 ఉంటుందని పోలీసులు తెలిపారు.

మృతదేహం లభ్యం

మడికొండ, మార్చి 28 : మడికొండలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. స్థానిక ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల మేరకు.. మడికొండలోని శ్రీరామ బార్ సమీపంలోని ఓ లాండ్రీ షాప్ వెనుక ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి డ్రాయర్ మాత్రమే ధరించి బట్టలు లేకుండా బోర్లా పడి మృతి చెంది ఉన్నాడు. అక్కడ ఉండే వారిని విచారించగా సదరు వ్యక్తి రెండు, మూడు రోజులుగా అక్కడే తిరుగుతున్నాడని, ఇతర రాష్ట్రానికి చెదిన వాడై ఉంటాడని, హిందీలో మాట్లాడేవాడని చెప్పినట్లు తెలిపారు. మృతుడు ఆహారం లేక అలసిపోయి శరీరంలో ఓపిక లేక అలాగే ముందుకు పడిపోయి చనిపోయి ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసి మార్చురీకి తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. ఆచూకీ తెలిసిన వారు సెల్. 87126 85123, 87126 85248 నెంబర్లకు సమాచారం అందజేయాలని కోరారు.

పని బారెడు.. జీతం చారెడు..

● ఉపాధి క్షేత్ర సహాయకులపై పని భారం ● పెరిగిన పంచాయతీలు.. పెరగని ఫీల్డ్ అసిస్టెంట్లు
● 1,680 పంచాయతీలకు 800 మందే విధులు ● ఒక్కొక్కరికి మూడు నాలుగు పంచాయతీలు





హనుమకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులపై పని భారం రోజు రోజుకు పెరుగుతోంది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,668 గ్రామ పంచాయతీలు ఉండగా, క్షేత్ర సహాయకులు మాత్రం 800 మంది వరకే ఉన్నారు. మొదట్లో 1,018 మంది క్షేత్ర సహాయకులు ఉండేవారు. కొందరు మధ్యలో ఉద్యోగం మానేశారు. మరికొందరు వివిధ కారణాల వల్ల ఉద్యోగాల నుంచి తొలగింపబడ్డారు. కొంత మంది మరణించారు. దీనితో క్షేత్రసహాయకుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఉన్నవారిపైనే పని భారం పడుతోంది.

క్షేత్ర సహాయకుల కొరత

గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీల పునర్విభజన చేపట్టింది. 500 మించి జనాభా కలిగిన తండాలను సైతం గ్రామ పంచాయతీలుగా మార్చింది. దీనితో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య 1080 నుంచి 1,668 వరకు పెరిగింది. పెరిగిన గ్రామ పంచాయతీలకు అనుగుణంగా క్షేత్ర సహాయకుల సంఖ్యను పెంచలేదు. గ్రామ పంచాయతీలు పెరగక ముందు గతంలో ప్రతీ పాత గ్రామపంచాయతీకి ఒక్కరు చొప్పున క్షేత్ర సహాయకులుఉ ఉండేవారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలను పెంచింది కానీ.. ఆ మేరకు క్షేత్ర సహాయకులను మాత్రం పెంచలేదు. ప్రస్తుతం పాత పంచాయతీల్లో పని చేస్తున్నవారికే కొత్తపంచాయతీల బాధ్యతలను కూడా అప్పగించింది. దీనితో ఒక్కో క్షేత్ర సహాయకుడు పెద్ద పంచాయతీలు అయితే రెండు, మూడు.. చిన్న పంచాయతీలైతే నాలుగైదు వరకు చూసుకోవలసి వస్తోంది. దీంతో వారిపై పని భారం పెరిగి సతమతమవుతున్నారు. ఉపాధి పనుల అమలును సరిగా పర్యవేక్షించలేని పరిస్థితి ఏర్పడుతోంది. క్షేత్రసహాయకుల కొరత వల్ల కొన్ని పంచాయతీల్లో కార్యదర్శులు కూడా ఉపాధి పనులను చూస్తున్నారు.

పని భారం

తమను క్రమబద్ధీకరించాలంటూ సమ్మెకు దిగిన క్షేత్ర సహాయకులను గత ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. వారు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో వీరిని మళ్లీ విధుల్లోకి తీసుకున్నది. అయినప్పటికీ పంచాయతీకి ఒకరు చొప్పున క్షేత్రసహాయకులను నియమించలేదు. ఒక్కడే క్షేత్ర సహాయకుడు మూడు నాలుగు గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పనులను పర్యవేక్షించాల్సి రావడం వల్ల కూలీల హాజరు నమోదు కష్టంగా మారుతోంది. కూలీల ఫొటోలను అప్‌డేట్ చేయలేకపోతున్నాడు. దీంతో క్షేత్రసహాయకులు చేసేది లేక ఒక గ్రామాన్ని వారు చూసుకుంటూ మిగిలిన గ్రామాల్లో హాజరు నమోదు బాధ్యతను కూలీల్లో ఒకరికి అప్పగిస్తున్నారు. ఇలా చేయడంతో పనులకు హాజరుకాని వారికి కూడా హాజరు వేసే అవకాశముంటుంది.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో తిప్పలు

ఉపాధి హామీ పథకంలో భాగంగా గతంలో రాష్ట్రప్రభుత్వం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించేవారు. అన్ని రాష్ట్రాల్లో సాఫ్ట్‌వేర్లు ఒకేలా ఉండాలని కేంద్రం ఆదేశించడంతో రెండేళ్లుగా కొత్తదానిని ఉపయోగిస్తున్నారు. ఈసాఫ్ట్‌వేర్‌తో గందరగోళ పరిస్థితి ఏర్పడుతోంది. పాత పంచాయతీ నుంచి విడిపోయి కొత్తగా ఆవిర్భవించిన వాటిలో కూలీలకు చెల్లింపులు ఆలస్యమవుతున్నాయి. కూలీల పేర్లు రెండు పంచాయతీల్లో నమోదు కావడంతో అధికారులు వాటిని వేరు చేశారు. అప్పుడు క్షేత్ర సహాయకులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులే పనులు పర్యవేక్షించారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్ ప్రకారం పంచాయతీలు యూనిట్‌గా పనులు గుర్తించారు. అలాంటప్పుడు ఈ పంచాయతీకి ఒకరు చొప్పున క్షేత్ర సహాయకుడు ఉండాలి. కానీ అలా జరగడం లేదు. అన్ని చోట్ల కూలీల హాజరు నమోదు, క్షేత్ర స్థాయిలో చిత్రాలను ఆప్‌లోడ్ చేయడం కష్టంగా మారుతోంది. క్షేత్ర సహాయకులు తమకు అప్పగించిన పంచాయతీలకు వెళితేనే ఆ సాఫ్ట్‌వేర్ కూలీల హాజరు నమోదు అవుతుంది. దీంతో ఒక క్షేత్ర సహాయకుడు తనకు అప్పగించిన మూడు నాలుగు గ్రామ పంచాయతీలకు స్వయంగా వెళ్లి ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా కూలీల హాజరు నమోదు చేయడం ఇబ్బందిగా మారుతోంది. ఈ మూడునెలలు ఉపాధి పనులు జోరుగా సాగుతాయి. పైగా వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు సరిగా పండక, పండిన పంటలు ఎండిపోయి వ్యవసాయ కూలీలకు పనులు దొరకని పరిస్థితులు ఏర్పడనున్న దృష్ట్యా ఉపాధి పనులకు ఎక్కువ మంది వచ్చే అవకాశం కూడా ఉన్నది.

వెట్టిచాకిరీ

చాకిరి బారెడు.. వేతనం చారెడు చందంగా ఉంది క్షేత్ర సహాయకుల పరిస్థితి. వారికి ఇచ్చే వేతనం అతి తక్కువ. కానీ పని భారం మాత్రం అధికంగా ఉంటోంది. ప్రస్తుతం క్షేత్ర సహాయకులకు రూ.10,500 ఇస్తున్నారు. ఇందులో కోతలు పోను వారి చేతికి అందేది రూ.8900 మాత్రమే. ఇందులోనూ కూడా ఇంకా కోతలు విధిస్తున్నారు. గ్రామ పంచాయతీలో 30 శాతానికిపైగా కూలీలు ఉపాధి పనులకు వచ్చేట్టు చేస్తేనే పూర్తి వేతనం ఇస్తారు. ఇది ఏ మాత్రం తగ్గిన వేతనంలో కోత పెడుతున్నారు. ఈ నిబంధన క్షేత్ర సహాయకులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగినప్పుడు ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య సహజంగానే తగ్గుతుంది. పైగా చిన్న పంచాయతీల్లో జాబ్ కార్డు కలిగిన కూలీలు తక్కువగా ఉంటారు కనుక పెద్దగా సమస్య ఉండడం లేదు. కానీ అదే 3500 నుంచి 4000 వరకు జాబ్ కార్డులున్న పెద్ద పంచాయతీల్లో 30శాతం మించి కూలీల హాజరు ఉండేట్టు చూడడం క్షేత్ర సహాయకులకు కష్టంగా మారుతోంది. ఈ నిబంధనను ఎత్తి వేయాలని వారు కోరుతున్నారు.

మూడు నెలలుగా వేతనాలు లేవు

క్షేత్ర సహాయకులకు వేతనాలు కూడా సకాలంలో అందడం లేదు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి వేతనాలను ఇప్పటివరకు చెల్లించలేదు. మార్చి నెల కూడా ముగుస్తోంది. తమకు ఇచ్చే వేతనాలే తక్కువ. అవి కూడా సకాలంలో చెల్లించకపోవడం వల్ల కుటుంబాలను పోషించుకోలేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని క్షేత్ర సహాయకులు ఆవేదన పడుతున్నారు.

రెగ్యులర్ చేసేదెప్పుడు ?

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు క్షేత్ర సహాయకులను రెగ్యులర్ చేస్తానని ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులు అయినా ఇప్పటి వరకు ఆ వాగ్దానం అమలు కాకపోవడం పట్ల క్షేత్ర సహాయకులు విచారం వ్యక్తం చేస్తు న్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమను ఏ మాత్రం పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం అయినా తమను ఆదుకోవాలలని క్షేత్ర సహాయకులు కోరుతున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక క్షేత్ర సహాయకుడిని నియమంచి పని భారం తగ్గించాలని, కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలని, 30శాతానికిపైగా కూలీల హాజరు తప్పనిసరి నిబంధనను తొలగించాలని, ప్రతీ నెల వేతనాలను చెల్లించాలని, ప్రస్తుతం బకాయి ఉన్న మూడు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని, తమ సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని క్షేత్ర సహాయకులు కోరుతున్నారు.

జాతీయ వైద్య సదస్సుకు డాక్టర్ కూరపాటి రమేష్‌కు ఆహ్వానం



వరంగల్ మెడికల్, మార్చి 28: ఢిల్లీలో ఈ నెల 29, 30 తేదీలల్లో జరుగనున్న హెర్నియా నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు వరంగల్‌కు చెందిన డాక్టర్ కూరపాటి రమేష్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు గురువారం డాక్టర్ కూరపాటి రమేష్ వివరాలను వెల్లడించారు. సంక్లిష్టమైన అడ్వాన్స్ లాపరోస్కోపిక్ ఆపరేషన్స్ నూతన వైద్య విధానంపై అవగాహన సదస్సులో ప్రసంగం ఉంటుందని పేర్కొన్నారు. నూతన వైద్యవిధానాల వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కాగా, డాక్టర్ రమేష్‌కు ఆహ్వానం అందడంపై ఐఎంఏ ప్రతినిధులు, వరంగల్ సర్జికల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో సభ్యుడిగా రియాజ్



హనుమకొండ సిటీ, మార్చి 28: కాంగ్రెస్ జాతీయ మేనిఫెస్టో కమిటీ సభ్యుడిగా టీపీసీసీ అధికార ప్రతినిధి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ రియాజ్ నియమితులయ్యారు. హనుమకొండ జిల్లాకు చెందిన డాక్టర్ రియాజ్‌కు ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీలో స్థానం కల్పించారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ఛైర్మన్‌గా ఉన్న కమిటీ రానున్న లోక్‌సభ ఎన్నికల క్రమంలో ప్రజల వద్దకు వెళ్లనుంది. 15 రోజుల వ్యవధిలో ప్రజాభిప్రాయాలను సేకరించి ఏఐసీసీకి తెలియచేయనుంది.

మంద కృష్ణను కలిసిన అరూరి రమేష్


అరూరిని సన్మానిస్తున్న మంద కృష్ణ

హనుమకొండ టౌన్, మార్చి28: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ గురువారం హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అరూరిని మంద కృష్ణ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

న్యూశాయంపేటలో కుక్కల స్వైర విహారం


గాయపడిన బాలిక

న్యూశాయంపేట, మార్చి 28: గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ 31వ డివిజన్ న్యూశాయంపేటలో గురువారం కుక్కలు స్వైర విహారం చేశాయి. న్యూశాయంపేటలోని పద్మశాలీ కాలనీకి చెందిన గుండు శరణ్య అనే బాలికను అలాగే రాసమల్ల వాడకు చెందిన పాలబిందల కనకలక్ష్మీ అనే వృద్ధురాలిపై గురువారం కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే బాధితులు స్థానిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. న్యూశాయంపేటలోని ప్రతీ కాలనీలో పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయని, మునిసిపల్ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పట్టికైనా మునిసిపల్ అధికారులు సిబ్బందిని పంపించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

చెన్నారావుపేట, మార్చి 28: మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన ఓ మహిళ ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైనట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ గురువారం తెలిపారు. వరంగల్ ఏనుమాములకు చెందిన దివ్యకు గురిజాలకు చెందిన దౌడు రాజుతో ఆరేళ్ల కిత్రం వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల , ఏడాది వయసున్న వర్షిణి, పప్పి ఉన్నారు. రాజు స్థానిక ప్రైవేటు స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. రాజు మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో గొడవకు దిగేవాడు. దీంతో విసుగు చెందిన దివ్య బుధవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండానే ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లిపోయింది. బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దివ్య తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పోచమ్మమైదాన్‌లో భారీ అగ్ని ప్రమాదం

● చౌరస్తా సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో చెలరేగిన మంటలు ● షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన బ్యాంకెట్ హాల్, ఇన్సూరెన్స్ కార్యాలయం


దగ్ధమవుతున్న షాపింగ్ కాంప్లెక్స్ లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పోచమ్మమైదాన్, మార్చి 28: వరంగల్ నగరం నడిబొడ్డున పోచమ్మమైదాన్ చౌరస్తా సమీపంలోని ఓ షాంపింగ్ కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా చెలరేగిన మంటలు... కాంప్లెక్స్‌లోని మూడు అంతస్థులకూ వ్యాపించాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తా సమీపంలోని జకోటియా షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండో అంతస్తులో ఉన్న ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. పొగరావడం గమనించిన సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. అనంతరం కాంప్లెక్స్‌లోని మిగతా షాపుల నిర్వాహకులను అప్రమత్తం చేశారు. కాసేపటికే ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయం పూర్తిగా మంటలు వ్యాపించి ఎగిసిపడ్డాయి. మూడో అంతస్థులో ఉన్న బ్యాంకెట్‌హాల్‌లోకి కూడా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని అర్ధరాత్రి వరకు మంటలను ఆర్పేందుకు యత్నించారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, డీసీపీ దేవేందర్‌రెడ్డితో పాటు ఐదుగురు సీఐలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. ప్రమాదం సంభవించిన చోట ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడటంతో వారిని అదుపుచేయడం కష్టంగా మారింది. దీంతో పోలీసులు పలుమార్లు స్థానికులను చెదరగొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే మంటలకు కాంప్లెక్స్‌లోని ఏసీ కంప్రెషర్లు అన్ని పేలగా.. ఆశబ్దాలకు జనం భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన అధికారులు వెంటనే విద్యుత్తు సరాఫరాను నిలిపివేశారు.

మూడు ఫైరింజన్లు, మునిసిపల్ వాటర్ ట్యాంకర్లతో....

మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఫైర్ సిబ్బంది శ్రమించారు. మూడు ఫైరింజన్లతో మూడు వైపులా నుంచి నీటిని చిమ్మినా మంటలు అదుపులోకి రాలేదు. ఈ క్రమంలోనే మునిసిపల్ వాటర్ ట్యాంకర్లతో సైతం నీటిని తీసుకువచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు యత్నించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. రెండు కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో స్థానికులు, పరిసరాల్లో నివాసం ఉండే వారు భయాందోళనకు గురవగా.. ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో పెట్రోల్ పంపులు కూడా ఉండటంతో అందరూ ఆందోళనకు గురయ్యారు.

ఘటనా స్థలానికి మంత్రి సురేఖ

ఘటనా స్థలాన్ని దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ సందర్శించారు. ఘటన విషయం తెలుసుకున్న మంత్రి హుటాహుటిన తరలివచ్చి అధికారులతో మాట్లాడారు. ప్రపమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. కలెక్టర్ ప్రావీణ్య, మునసిపల్ కమిషనర్ అశ్విని తానాజీవాకొడే ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అస్వస్థతకు గురైన సీఐ గోపి

మంటలను అదుపుచేసే అక్రమంలో మట్వాడ సీఐ గోపి అస్వస్థతకు గురయ్యారు. ఎగిసిపడుతున్న మంటలను భారీ స్థాయిలో పొగలు విరజిమ్మడంతో శ్వాస సంబంధ సమస్య తలెత్తి అస్వస్థతకు గురవడంతో వెంటనే ఆయన్ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. గోపి చికిత్స పొందుతున్నారు.


కాంప్లెక్స్ వద్ద గుమికూడిన ప్రజలు




సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి కొండా సురేఖ, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

దళిత యువకుడిపై దాష్టీకం

కూతురిని ప్రేమించాడని చితకబాదిన వైనం
టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు
వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన

నర్సంపేట టౌన్, మార్చి 28 : ప్రేమ వ్యవహారంలో ఓ దళిత యువకుడిని కొందరు వ్యక్తులు చితకబాదగా.. ఈ కేసులో వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన ముగ్గురిని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలావున్నాయి.

నర్సంపేట పట్టణానికి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన యువతి, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని చర్లపాలెం గ్రామానికి చెందిన ఓదళిత యువకుడు ధర్మవరపు ప్రకాష్‌రాజ్ కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో తరుచూ ఆ యువకుడు నర్సంపేట వెళుతూ పట్టణంలో నివాసం ఉంటున్న యువతిని కలిసే వాడు. ఈ క్రమంలో వీరి ప్రేమ వ్యవహారం యువతి ఇంట్లో తెలిసి ప్రకాష్‌రాజ్‌ను మందలించారు. అయినా వారిద్దరూ ప్రేమించుకుంటూనే ఉండటంతో యువతి తండ్రి ప్రకాష్‌రాజ్‌ను తన కూతురికి దూరం చేయాలని భావించి.. తన స్నేహితులైన మాజీ ప్రజాప్రతినిధి, రియల్ ఎస్టేట్ వ్యాపారితోపాటు మరో ఇద్దరు కలిసి పథకం రూపొందించారు.

ఈ నెల 24న యువతి సెల్‌ఫోన్ నుంచి ప్రకాష్‌రాజ్‌కు 'ఇంట్లో ఎవరూలేరని నీవు రా' అంటూ మెసేజ్ పంపారు. తన ప్రియురాలే ఆ మెసేజ్ చేసిందనుకొని నర్సంపేటకు వచ్చిన ఆ యువకుడిని యువతి తండ్రి, అతడి స్నేహితులు చావబాది, యువకుడితోనే 100కు డయల్ చేసి, తాను యువతి ఇంట్లోకి దొంగతనానికి వచ్చానని, ఇదే సందర్భంలో గాయాలయ్యాయని చెప్పాలని బెదిరించి మరీ పోలీసులకు ఫోన్ చేయించారు.

దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని యువకుడిని ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించి విచారణ చేయగా అతడు జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించాడు. పోలీసులు యువకుడి తండ్రికి సమాచారం అందించగా.. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో యువకుడి తండ్రి ఫిర్యాదు చేశారు. అయితే దళిత యువకుడిపై జరిగిన దాడిని పరువుదాడిగా భావించిన దళిత సంఘాలు పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. ఆ తర్వాత వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు యువకుడిని చితకబాదిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్న వారిని ప్రేమ వ్యవహారంతోపాటు భూ దందాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై సైతం టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణ చేస్తున్నట్లుతెలిసింది. ఈ విషయంపై స్థానిక టౌన్ సీఐ రమణమూర్తిని సంప్రదించగా.. ఈ ఘటన గురించి తన దృష్టికి రాలేదన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ వెంకటరత్నం

సాంకేతిక తోడ్పాటుతోనే వాణిజ్యాభివృద్ధి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 28: వాణిజ్యాభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ వెంకటరత్నం అన్నారు. గురువారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 'ఫిన్‌టెట్ రెవల్యూషన్' అనే అంశంపై జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ వెంకటరత్నం మాట్లాడుతూ... ఆధునిక సాంకేతిక రంగంలో వస్తున్న వినూత్నమైన టెక్నాలజీతో ప్రపంచ వర్తక, వాణిజ్య సులభతరమైందన్నారు. మారిన ప్రపంచానికి అనుగుణంగా వాణిజ్య రంగం రూపాంతరం చెందడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేవారు.

కేయూ మాజీ రిజిస్ట్రార్ సాయిలు మాట్లాడుతూ... కొవిడ్ తర్వాత ఆన్‌లైన్‌లో వర్చువల్ సదస్సులు నిర్వహించుకోవడాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో యూజీసీ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, రిటైర్డ్ ప్రొఫెసర్లు రాజిరెడ్డి, సక్రియా, కృష్ణమాచారి, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ కనకయ్య, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి, ప్రొఫెసర్లు కృష్ణారెడ్డి, రాజేందర్, అమరవేణి, డాక్టర్ ప్రగతి, డాక్టర్ రజని, డాక్టర్ సాయిచరణ్, డాక్టర్ సురేష్, డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ సునిత, డాక్టర్ సరిత, డాక్టర్ రమాదేవి, డాక్టర్ నిరంజన్, డాక్టర్ నరేందర్, పీఆర్వో ఆదిరెడ్డి పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, మార్చి 28: జిల్లాలోని పలుచోట్ల బెల్టు షాపులపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి రూ.1లక్ష విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. గురువారం టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ఆధ్వర్యంలో కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుబ్బాయిపల్లి, ఎల్కతుర్తి మండలం పరిధిలోని కేశవపూర్, దామెర గ్రామాల్లో దాడులు నిర్వహించారు. మద్యం స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఏసీపీ మధుసూదన్ ధ్రువీకరించారు.

వ్యక్తి అదృశ్యం

వరంగల్ క్రైం, మార్చి 28: కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని జవహర్‌కాలనీ వాస్తవ్యుడైన పూజారి శంబుప్రసాద్(48) బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటిక వెళ్లి తిరిగిరాలేదు. ఈయనకు ఇటీవలే బ్రెయిన్ సర్జరీ జరగడంతో అనారోగ్యంతో ఉన్నాడు. అతడికి ఏమీ గుర్తుకు ఉండటం లేదు. ఈ విషయాన్ని కేయూ ఎస్ఐ దేవేందర్ ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అచూకీ తెలిసిన వారు 8712685088 నంబర్‌కు తెలుపగలరని ఆయన సూచించారు.


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పాస్టర్ ఐజక్

కాంగ్రెస్ టికెట్ దళిత క్రిస్టియన్లకే కేటాయించాలి

వడ్డెపల్లి, మార్చి 28: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ దళిత క్రిస్టియన్ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు కేటాయించాలని ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ ఐజక్, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేను, ఏఐసీసీ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని కోరారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు పాస్టర్ జోసఫ్ ప్రభాకర్ మాట్లాడారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో దళిత క్రిస్టియన్లు అధికంగా ఉన్నారని, డాక్టర్ రామకృష్ణకు టికెట్ కేటాయిస్తే ఇతర సామాజిక వర్గాలను కలుపుకొని అధిక మెజారిటీతో గెలిపించుకుంటామని అన్నారు. సమావేశంలో ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ ప్రతినిధులు సువర్ణరాజ్, లాజరెస్, తాళ్లపెల్లి ప్రసంగి, డేవిడ్, పాస్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి



అరూరి రమేశ్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు

జఫర్‌గడ్, మార్చి 28 : జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ కార్యకర్తలను కోరారు. గురువారం జఫర్‌గడ్ శివారు వడ్డెగూడెంకు చెందిన వివిధ పార్టీలకు చెందిన బొడ్డు అశ్విని, మారెపల్లి విజయ, బొజ్జు రాణి కుంటాల శాంత, రంగమ్మ, తాటికాయల రేణుక, శోభ, పద్మ, గుడ్డేటి రాజు, తదితర మహిళా కార్యకర్తలు హన్మకొండలో అరూరి రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సింగారపు రమేశ్, జిల్లా, మండల నాయకులు తిరుపతి, సురేశ్ గౌడ్, గణేష్, రామరాజు, సందీప్, శ్రీనివాస్, గాదెపాక శ్రీను, లోకేశ్, చెన్నూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలి

- ఉప కేంద్రాలకు శాశ్వత భవనాల ఏర్పాటుకు చర్యలు
- జిల్లా ప్రధాన వైద్యాధికారి హరీశ్‌రాజ్

జఫర్‌గడ్, మార్చి 28 : ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య ప్రధాన వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) హరీశ్‌రాజ్ వైద్యులు, సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన జఫర్‌గడ్ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వివిధ విభాగాల గదులు, సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, అందిస్తున్న వైద్య సేవలు, చికిత్స వంటి అంశాలతో పాటు ఆసుపత్రి పరిధిలో ఉండే ఆరోగ్య ఉపకేంద్రాల(పల్లె దవాఖాన)పై తెలుసుకున్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది హాజరు, మందుల పంపిణీ, తదితర పలు రికార్డులను పరిశీలించారు. అలాగే ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి రక్తశుద్ధి చేయించుకుంటున్న కిడ్నీ రోగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ హరీష్‌రాజ్ మాట్లాడుతూ ఆసుపత్రి పరిధిలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆరు ఆరోగ్య ఉప కేంద్రాల్లో కొన్నింటికైనా శాశ్వత భవనాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని, ఆపరేషన్లకు అవసరమైన పరికరాల వివరాలను అందజే యాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. మరో 10 రోజుల్లో మరో సారి ఆసుపత్రిని సందర్శించి.. కావలసిన సౌకర్యా లు, వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహి ంచనున్నట్లు ఆయన అన్నారు. ఆసుపత్రి వైద్యాధికారి విష్ణు, వివిధ విభాగాల వైద్యులు రజిని, శశికళ, ప్రభాకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్ ఘన్‌పూర్ పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హరీష్ రాజ్

ఘన్‌పూర్ పీహెచ్‌సీ తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్ పీహెచ్‌సీ, క్లస్టర్ ఆసుపత్రిని గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరీష్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులు, గదులు, ఆపరేషన్ థియేటర్ కలియ దిరిగి సిబ్బంది పనితీరును పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఓపీ, ఐపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ప్రసూతి కేసులు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, డీపీఎల్, ట్యూబెక్టమీ ఆపరేషన్ల లక్ష్యం చేరుకోవడానికి కృషి చేయాలని ఆదేశించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం, గర్భిణీలకు పరీక్షలు, పిల్లలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై సూచనలు చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది విధులు, సీహెచ్‌ఎస్‌సీ సిబ్బంది విధులను తెలియజేశారు. వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారులతో ఒకసారి స్టేషన్ ఘన్‌పూర్‌లో సమావేశం ఏర్పాటు చేయాలని డాక్టర్ హరీష్ రాజ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు జనార్ధన్, సంధ్య రాజు, వీ రాంజనేయులు, ప్రసన్న కృష్ణ, సీహెచ్‌ఓ సాంబయ్య, హెచ్‌ఈ ప్రభాకర్, పీహెచ్‌సీ సిబ్బంది, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ గుడిలో చోరీ

జనగామ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాకేంద్రంలోని బతుకమ్మకుంట దుర్గమ్మ దేవాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం ఆవరణలో ఉన్న హుండీని పగలగొట్టి అందులో ఉన్న రూ. 20 వేల నగదును ఎత్తుకెళ్లారు. గురువారం తెల్లవారు జామున చోరీ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భరత్ తెలిపారు. గతంలో పలుమార్లు ఆలయంలో దొంగతనం జరిగిందని, కానీ దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని స్థానికులు అంటున్నారు.

'బార్' అధ్యక్షుడిగా చంద్రరుషి



వై.చంద్రరుషి

జనగామ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జనగామ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వై.చంద్రరుషి ఎన్నికయ్యారు. జిల్లాకేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో డి.హరిప్రసాద్‌యాదవ్‌పై చంద్రరుషి గెలుపొందారు. ఉపాధ్యక్ష పదవికి కె.రాంరెడ్డి, ఎన్.బాలకిషన్ పోటీ పడగా ఎన్.బాలకిషన్, ప్రధాన కార్యదర్శి పదవికి టి.రాజయ్య, ఎన్. సిద్ధులు, ఎన్.రేణుక బరిలో నిలవగా ఎన్. సిద్ధులు గెలుపొందారు. అదేవి ధంగా జాయింట్ సెక్రటరిగా మన్నె సత్తయ్య, కోశాధికారిగా సీహెచ్. చంద్రశేఖర్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా పి.మురళి, కార్యవర్గసభ్యులుగా ఈ.జ్యోత్స్న, కె.దాసు, ఈ.ఉదయ్, జె.రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా శ్రీరామ్ శ్రీనివాస్, సహాయ ఎన్నికల అధికారులుగా పాలకుర్తి రామకృష్ణ, ఆకుల శ్రీనివాస్ వ్యవహరించారు.

యువత ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలి

బచ్చన్నపేట, మార్చి 28: యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకుంటూ ముందుకెళ్లాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో స్వయం ఉపాధి కోసం కంటెం కర్ణాకర్ మరి కొందరితో కలిసి ఏర్పాటు చేసుకున్న హోటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న అనేక మంది ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల కంటే ఎక్కువ సంపాదిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి, మాసపేట రవీందర్‌రెడ్డి, వేముల వెంకట్‌గౌడ్, జంగిటి నరేష్, దిడిగ రమేశ్, పిన్నింటి నారాయణరెడ్డి, నిమ్మ కరుణాకర్‌రెడ్డి, కర్రె నరేష్, క్రాంతికుమార్, గంగరబోయిన మహేందర్‌లున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి

నర్మెట, మార్చి 28 : ద్విచక్ర వాహనం(స్కూటీ) అదుపు తప్పి ఉపాధ్యాయురాలు మృతి చెందిన సంఘటన గురువారం నర్మెట మండలంలోని గుంటూరుపల్లి స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తరిగొప్పుల మండల కస్తూర్బా పాఠశాలలో జీవశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు ఎర్ర అరుణజ్యోతి(37) తన విధి నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం పాఠశాలకు ఆలస్యం అవుతుందని భర్త క్రాంతిని పాఠశాల వరకు డ్రాప్ చేయమని అడిగింది. జనగామ నుంచి కస్తూర్బా పాఠశాలకు భర్త క్రాంతితో కలిసి స్కూటీ వాహనంపై వస్తున్న క్రమంలో గుంటూరుపల్లి స్టేజి సమీపంలో(శ్రీచైతన్య స్కూల్ దగ్గర) స్కూటీ అదుపు తప్పింది. దీంతో భార్యభర్తలు ఇద్దరు కింద పడ్డారు. అరుణజ్యోతి తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఆమెకు పది నెలల చిన్న పాప ఉందని బంధువులు తెలిపారు.

బాలయేసు పాఠశాలలో విద్యార్థులకు పాద శుద్ధీకరణ



బాలయేసు పాఠశాలలో పాదశుద్ధీకరణ చేస్తున్న ఫాదర్ ఫ్రాన్సిస్ జాన్, ఫాదర్ దిలీప్

దేవరుప్పుల, మార్చి 28: మండలకేంద్రంలోని బాలయేసు పాఠశాలలో పవిత్ర వారంలోని గురువారం విద్యార్థులకు ఫాదర్ ఫ్రాన్సిస్ జాన్, ఫాదర్ దిలీప్ పాదశుద్ధీకరణ చేశారు. ఏసుక్రీస్తు తను చనిపోవటానికి ముందు ప్రపంచం మొత్తం ప్రేమ సౌభ్రాతృత్వంలో మెలగాలని ప్రతీ ఒక్కరూ ప్రేమానురాగాలతో జీవితం గడపాలని గుర్తుగా తన 12మంది శిష్యులకు పాదశుద్ధీకరణ చేశారు. ఈనేపథ్యంలో బాలయేసు పాఠశాలలో అదే విధంగా ఫాదర్స్ బాలయేసు మందిరంలో ప్రత్యేక ప్రార్ధనలు చేసి విద్యార్థులకు పాదశుద్ధీకరణ చేశారు. అనంతరం కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ మాట్లాడుతూ విద్యా శ్రేయస్సే తమ ఆకాంక్ష అని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరిసిల్లకు నాయకుల సన్మానం



సిరిసిల్ల రాజయ్యను సన్మానిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 28: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియామకమైన, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను హనుమకొండలోని ఆయన నివాసంలోగురువారం జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి ఆధ్వర్యంలోని నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న ప్రతీ నాయకుడిని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించి వారికి సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు అందుకు నిదర్శనం సిరిసిల్ల రాజయ్య అన్నారు. సిరిసిల్లను కలిసిన వారిలో మాజీ కుడా డైరెక్టర్ ఆకుల కుమార్, నాయకులు పసునూరి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టెన్త్ పరీక్షలు

జనగామ కల్చరల్, మార్చి 28: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు కొనసాగుతున్నాయి. విద్యార్థులకు గురువారం బయలాజిక్ సైన్స్ పరీక్ష నిర్వహించారు. 6698 మంది విద్యార్థులకు గాను ఆరుగురు గైర్హాజరు కాగా 6692 మందితో 99.91 శాతం విద్యార్థులు హాజరైనట్లు డీఈఓ కె.రాము తెలిపారు.

పరీక్షల సందర్భంగా డీఈఓ కె.రాము నర్మెట, తరిగొప్పుల, చిలుపూరు మండలాల్లో 5 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 7 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు. డీఈవో వెంట ఏసీజీ రవికుమార్ ఉన్నారు.

హక్కులు, బాధ్యతల పట్ల పిల్లలు అవగాహన కలిగి ఉండాలి

జనగామ కల్చరల్, మార్చి 28: పిల్లలు హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన కలిగి ఉండాలని జనగామ జిల్లా కోర్టు అడిషనల్ జూ నియర్ సివిల్ జడ్జి కె.సందీప కోరారు. గురు వారం జనగామ జిల్లా కేంద్రం లోని బాలసదన్ చిల్డ్రన్స్ హోమ్ లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లలకు హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. బాలికలు ఆరోగ్యంగా ఉండాలని, చక్కగా చదవాలని, పిల్లలపై ఎవరైనా కఠినంగా ప్రవర్తిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలను అనేక విషయాలు అడిగి తెలుసుకున్నారు. బాలసదన్‌లో కిచెన్, బాలికల వసతిగృహం, సీసీ కెమెరాలను పరిశీలించారు. బాలికలకు ఏవైనా సమస్య లు వస్తే ఉపాధ్యాయులకు గానీ, తల్లిదండ్రులకు గానీ వెంటనే తెలియజేయాలన్నారు. అనంతరం బాలికలకు బిస్కెట్లు, ఐస్‌క్రీమ్ పంపిణీ చేశారు. బాలసదన్ ప్రిన్సిపాల్ కె.వెరోనిక, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.రవీంద్ర, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఇ.జ్యోత్స్న పాల్గొన్నారు.



లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సందీప

వేంకన్న ఆలయ హుండీ ఆదాయం రూ 5.30 లక్షలు

చిలుపూర్, మార్చి 28 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ 5. 30 లక్షలు సమకూరినట్లు ఆలయ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి (ఈవో) భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. గురువారం ఆలయంలో నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమానికి దేవాదాయ శాఖ నల్లగొండ జిల్లా ఇన్స్‌పెక్టర్ బి. సుమతి పర్యవేక్షణ అధికారిగా హాజరు కాగా, ఆలయ ధర్మకర్తలు, రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో హుండీలను విప్పి అందులో ఉన్న రూపాయలను లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ, స్వామివారి ఆశీస్సులతో కేవలం 90 రోజుల వ్యవధిలోనే అత్యధిక ఆదాయం సమకూరడం శుభపరిణామమన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, పూజారులు రంగాచార్యులు, కృష్ణమాచా ర్యులు, జూనియర్ అసిస్టెంట్ రమేష్, ఇండియన్ బ్యాంకు అధికారి గంగాధర్, సుభాష్, రికార్డు అసిస్టెంట్ వీరన్న, మహేశ్, రాజశేఖర్, స్వరూప, విశాల్, కృష్ణ పాల్గొన్నారు. చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల జరిగిన బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజతలు తెలిపారు. చైర్మన్ వెంట ధర్మకర్తలు ఉప్పరి గణేశ్, రాజశేఖర్, ఎల్లమ్మ ఉన్నారు.

తేనెటీగల దాడిలో 15 మందికి గాయాలు

రఘునాథపల్లి, మార్చి 28: తేనేటీగలు దాడి చేయడంతో సుమారు 15 మంది ఆసుపత్రి పాలైన సంఘటన రఘునాథపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన సుమారు 20 మంది డీసీఎం వాహనంలో మేడారం వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదా రిపై రఘునాథపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో డిసీఎం వాహనం టైరు పంక్చర్ కావడంతో నిలిచిపోయింది. వాహనం నిలిచిపో యిన రహదారి సమీపంలోని చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా డీసీఎం వాహనంలో ఉన్న వారిపై దాడికి పాల్పడ్డాయి. దీంతో భయాం దోళనకు గురైన బాధితులు పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీశారు. స్పందించిన పోలీసులు తేనెటీగల దాడికి గురైన సుమారు 15 మందిని జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అవకాశవాద పార్టీలకు బుద్ధి చెప్పాలి

జనగామ కల్చరల్, మార్చి 28: రానున్న లోకసభ ఎన్నికల్లో అవకాశవాద పార్టీలకు బుద్ధి చెప్పాలని పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ భువనగిరి లోకసభ అభ్యర్థి వి.సదానందరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత రాజకీయ పార్టీలన్నీ ప్రజల శ్రమను, సంపదను దోచుకోనికే రాజకీయం అనే ముసుగులో చేయకూ డని పనులన్నీ చేస్తున్నా యన్నారు. ఈ దోపిడీ రాజకీయాల నుంచి ప్రజలను రక్షించడమే ధ్యేయంగా ఈ ఎన్నికలలో తాను పోటీ చేస్తు న్నానన్నారు. తనను గెలిపిస్తే రాజకీయాల్లో మార్పు తీసుకువస్తానని తెలిపారు.

ధర్మసమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఎన్నిక

జనగామ కల్చరల్, మార్చి 28: ధర్మసమాజ్ పార్టీ జనగామ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం జనగామ జిల్లా కేంద్రం లోని పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మేకల సుమన్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా గొల్లపల్లి చిరంజీవి, ఉపాధ్యక్షులుగా సందీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా బోనాసి పవన్ కళ్యాణ్, టేకులపల్లి రవి, కోశాధికారిగా నాగిళ్ల కిట్టయ్య, కార్యదర్శులుగా ఇరుగు బాబు, గొలుగొండ ఉమ, ఇనుముల ప్రశాంత్, కొల్లపురి రవి, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా పాకాల రవి, కార్యవర్గ సభ్యులుగా అనిల్‌కు మార్, గజ్జెల నవీన్, రవి, రాజు ఎన్నికయ్యారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 28: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రఘునాథపల్లి మండలంలోని కుర్చపల్లి గ్రామా నికి చెందిన తోకల సింధు ఎంపికైనట్లు కబడ్డీ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షులు పోగుల సారంగపాణి తెలిపారు. గురువారం ఘన్‌పూర్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల సూర్యపేట జిల్లాలోని చింతలపల్లి గ్రామంలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో సింధు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. మార్చి 30 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు బీహార్ రాజధాని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సింధు పాల్గొననుందని తెలిపారు. అసోసియేషన్ జిల్లా చైర్మన్ వై కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య, సహాయ కార్యదర్శి తోటకూరి వెంకటేశ్వర్లు, పీఈటీలు అన్నెపు కుమార్, సుధాకర్, మహేష్ పాల్గొన్నారు.

కంఠ మహేశ్వరస్వామికి మాజీ మంత్రి పూజలు



ఆలయంలో ప్రత్యేకపూజలు చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

దేవరుప్పుల, మార్చి 28: మండలంలోని సింగరాజుపల్లిలో గురువారం శ్రీకంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట, కళ్యాణ వేడుకల్లో రాష్ట్ర మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా గౌడ కులస్థులు అనేక మంది పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని తిలకించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, గౌడకుల పెద్దలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో వరంగల్ హీట్!

(5వ పేజీ తరువాయి)

వరంగల్ సీటును తమకే కేటాయించాలని సీపీఐ కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తోంది. లేదంటే ఫ్రెండ్లీ పోటీ తప్పదని కమ్యూనిస్టులు కాంగ్రెస్ అధినాయకత్వాన్ని కంగారు పెట్టిస్తున్నారు.

మాదిగలకే వరంగల్ అభ్యర్థిత్వం

రాష్ట్రంలో మూడు ఎంపీ సీట్లు ఎస్సీలకు రిజర్వు అవగా వీటిలో నాగర్ కర్నూలు, పెద్దపల్లి ఎంపీ టికెట్లు మాల సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు ఇచ్చారు. ఇక మిగిలింది కేవలం వరంగల్ సీటు మాత్రమే. ఇది కచ్చితంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేతలకే టికెట్ ఇవ్వాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. దీంతో తొలుత వరంగల్ సీటుపై సీనియర్ నేత అద్దంకి దయాకర్‌కు మాట ఇచ్చిన కాంగ్రెస్.. మాల, మాదిగ సామాజిక వర్గాల సమీకరణల నేపథ్యంలో అద్దంకి విషయంలో పునరాలోచన చేస్తోందని తెలుస్తోంది. పైగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కూడా మాల సామాజిక వర్గం వ్యక్తే కావడంతో వరంగల్ సీటు కచ్చితంగా మాదిగ సామాజిక వర్గం నేతకే కేటాయించాలని అధిష్టానం భావిస్తోంది.

సీటుపై కాంగ్రెస్‌లో భేదాభిప్రాయాలు..

వరంగల్ ఎంపీ సీటు సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రులకు మధ్య విభేదాలను తీసుకొస్తోందన్న చర్చ జరుగుతోంది. దొమ్మాటి సాంబయ్యకు ఇప్పించేందుకు రేవంత్‌రెడ్డి ప్రతిపాదనలు చేయగా.. మంత్రి కొండా సురేఖ తీవ్రంగా వ్యతిరేకించినట్టు ప్రచారం జరుగుతోంది. ఆమె జన్ను పరంజ్యోతికి టికెట్ ఇవ్వాలని కోరినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రేవంత్‌రెడ్డితో చర్చించిన అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సురేఖతో ఉన్న సత్సంబంధాలతో తెరపై దయాకర్ పేరు చక్కర్లు కొట్టింది. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘనపూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన శనిగపురం ఇందిర వరంగల్ ఎంపీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యుడు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క కూడా ఇందిర అభ్యర్థిత్వం వైపు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. సినీనటుడు శింబుతో కలిసి కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను బెంగళూరులో కలిసిన ఇందిర వరంగల్ టికెట్‌పై ఒత్తిడి తీసుకరాగా, డీకే కూడా ఇందిరా పేరును ప్రతిపాదిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు మాత్రం ఎన్నికల ఖర్చు తాము భరించే పరిస్థితిలో లేమని, ఆర్థిక, అంగ బలం ఉన్న వారిలో ఎవరికి టికెట్ ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని మెజార్టీ ఎమ్మెల్యేలు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షికి ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన అభిప్రాయ సేకరణలో తేల్చి చెప్పారట. వీరితో పాటు వైద్యులు రాగమల్ల పరమేశ్వర్, పెరుమాండ్ల రామకృష్ణ, సునితలతో పాటు ఆర డజను మంది ఆశావహులు కాంగ్రెస్ పెద్ద చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ క్రమంలో టికెట్ ఆశిస్తున్న దొమ్మాటి సాంబయ్య, జన్ను పరంజ్యోతి, పసునూరి దయాకర్, ఇందిరతో పాటు మరో నలుగురైదుగురిని అధిష్టానం పిలిచి చర్చలు జరిపినట్టు సమాచారం. సునిల్ కనుగోలు సర్వే రిపోర్టు కూడా ఆశావహుల ముందుంచి పోటీపై వారి అభిప్రాయాలు సేకరించిందని, త్వరగా వరంగల్ సీటుపై తేల్చాలని సీఎం రేవంత్‌రెడ్డి కూడా సూచించినట్టు తెలిసింది.

వరంగల్ కోసం సీపీఐ పట్టు..

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పని చేసిన సీపీఐ లోక్‌సభ ఎన్నికల్లోనూ పొత్తు కొనసాగించాలని, అందులో భాగంగా తమకు వరంగల్ సీటు ఇవ్వాలని లేదంటే కరీంనగర్ ఇవ్వాలని, దీనిపై ఒకట్రెండు రోజుల్లో తేల్చాలని కోరుతోంది. కానీ కాంగ్రెస్ జనరల్ స్థానమైన కరీంనగర్‌ను వదులుకునే అవకాశం లేకపోవటంతో ఎస్సీ రిజర్వుడు స్థానమైన వరంగల్ తమకు దక్కుతుందనే ధీమాలో కమ్యూనిస్టులున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం నుంచి కడియం కావ్య తప్పుకోవడం, ఆమె తండ్రి శ్రీహరి, ఆమె త్వరలోనే కాంగ్రెస్‌లో చేరాతారన్న ప్రచారం నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఎవరికి దక్కుతుందోనన్న చర్చ జరుగుతోంది.

ధూపదీప నైవేద్య పూజలు నిర్వహించకుంటే చర్యలు

దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి

చిలుపూర్, మార్చి 28 : దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆలయాల్లో నిత్యం ధూపదీప నైవేద్య పూజలు నిర్వహించని క్రమంలో కఠిన చర్యలు తప్పవని దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ సుమతి అన్నారు. గురువారం మండలంలోని నష్కల్ శివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ధూపదీప నైవేద్య, నిత్య పూజలు జరుగుతున్నాయా, లేదా అన్న విషయాన్ని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ సుమతి మాట్లాడుతూ, చారి త్రక శివాలయంలో నిత్యపూజలు, నివేదన కార్యక్రమాలు చేపట్టడం లేదని అందిన పిర్యాదు మేరకు గ్రామాన్ని సందర్శించామని, పురాతన, చారిత్రక ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. ఆలయాల అభివృద్ధికి స్థానికులు సహకరించాలని కోరారు. నిత్యపూజలు నిర్వహించకుంటే పూజారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గణపురం పరమేశ్, పాశం సురేశ్, మోడెం భిక్షపతి, శాతబోయిన మల్లయ్య, లింగంపల్లి సమ్మక్క జాతర డైరెక్టర్ రంగు సురేశ్, గంటె ఉపేందర్ యాదవ్, డాక్టర్ స్వరాజ్యం, పెద్దపురం, కీర్తి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి

పాలకుర్తి ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం

డీసీవోకు వినతి పత్రం అందచేసిన డైరెక్టర్లు

పాలకుర్తి, మార్చి 28 : పాలకుర్తి రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్) చైర్మన్, వైస్ చైర్మన్‌లపై తొమ్మిది మంది డైరెక్టర్లు గురువారం అవిశ్వాసం తీర్మానం పెట్టారు. జిల్లా సహకార అధికారి వై.రాజేందర్‌రెడ్డికి జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందచేశారు. ఈ సహకార సంఘంలో మొత్తం 13 మంది డైరెక్టర్లుండగా వారిలో 9 మంది టీఆర్ఎస్ డైరెక్టర్లు, 4 కాంగ్రెస్ పార్టీకి చెదిన డైరెక్టర్లు ఉన్నారు. గురువారం చైర్మన్ బొబ్బాల అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ కారుపోతుల వేణుపై తొమ్మిది డైరెక్టర్లు అవిశ్వాసం కోసం వినతి పత్రం అందచేశారు. వారిలో స్వంత బీఆర్ఎస్‌కు చెందిన 5 గురు డైరెక్టర్లు దారావత్ వాసునాయక్, గంట రామయ్య, బల్లుల స్వరూప, దండబోయిన నాగ మల్లు, చిలువేరు వీరయ్యలతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన 4గురు డైరెక్టర్లు కారుపోతుల శ్రీనివాస్, చింతం వెంకన్న, ఎడవెల్లి పుష్పలీల, కే. శేఖర్ జిల్లా సహకార అధికారికి అవిశ్వాసం కోరుతూ వినతి పత్రం అందజేశారు.



జిల్లా సహకార అధికారి రాజేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న పాలకుర్తి ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్లు

ఎన్నికల విధులను సమన్వయంతో నిర్వహించాలి

అవగాహన సమావేశంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, మార్చి 28: ఎన్నికల విధులను సమన్వయంతో నిర్వహించాలని జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం జనగామ జిల్లా కలెక్టరేట్ లో నోడల్ అధికారులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికలలో పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందన్నారు. ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు స్వీప్ కార్యక్రమాలు చేపట్టి పాఠశాలు, కళాశాలల్లోనూ ఫ్లెక్సీలతో ర్యాలీలు, సమావేశాలు నిర్వహించామన్నారు. ప్రజా ప్రతినిధుల సమక్షంలోనే ఈవీఎం ల క్లోజింగ్, ఓపెనింగ్ చేపట్టాలని అధికారులకు సూచించారు. అధికారులందరూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో ముందుకుపో వాలన్నారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్‌డీఓ లు కొమురయ్య, వెంకన్న, జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, జిల్లా, నియోజకవర్గ నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా